స్కెచ్

# పగటి కలల్లో సాహచర్యం

యస్. ఆర్. నంది

జర్మనీ ఫ్రాన్సుల్లో రచయిత అనేవాడికి ఎంతో గౌరవం వుంది. జర్మనీలో స్త్రీ తన కొడుకు ఒక రచయిత అయితే చాలు అని అనుకొంటుంది. ఫ్రాన్సులో ఆడపిల్లలుగల కుటుంబం, తమ యింట్లో 'అల్లుడు హోదాని' ఒక యువక రచయిత భర్తీ చేస్తే ఎంత బాగుంటుంది! అనే 'ఆశతో' వుంటుంది.

పైమాటలని మాఘమ్ అంటాడు. అవి చదివి నాకు చాలా 'ఆశ' పుట్టింది. జర్మనీకి పోతే లాభంలేదు గనక, ఫ్రాన్సుకి పోవాలనుకొన్నాను. నేనూ ఓ చిన్న యువక రచయితనే గాబట్టి ఫ్రెంచి యువతి ఎవరయినా ఒకత్తె నన్ను సులభంగా ప్రేమిస్తుంది. ఆ దేశాల్లో ప్రేమకి ఉన్నతస్థానం వుంది. అల్లుడికి ఎన్నో అధికారాలు వుంటాయి. వివాహం అయిన తర్వాత మామగారి యింట్లో మజాగా వుండొచ్చు. పనీ పాట లేకుండా కార్లమీద పారిస్ పట్టణమంతా తిరగొచ్చు. క్లబ్ కి పోవచ్చు. థియేటర్ కి పోవచ్చు. ఇంకా ఎన్నయినా చెయ్యొచ్చు. అమెరికా, రష్యాలు గూడా యిట్టే చూడొచ్చు. ఎంత అదృష్టం! పోవాలని నిశ్చయించుకొన్నాను.

అనుకోవడమయితే అనుకొన్నాను గాని, లేచేసరికి జేబీలో ఒక్క అణా కాసు మాత్రమే వుంది. డబ్బు లేకపోతే ప్రయాణం సాగదు. రచనలు రాసి తెలుగు దేశంలో డబ్బు సంపాయించుకోలేను. ఏం చెయ్యనురా భగవంతుడా అని నడుస్తూ ఆలోచించ మొదలుపెట్టాను.

లాటరీ వేస్తే లక్ష రూపాయలు వస్తాయి. కాని వెధవది దానికి ఒక రూపాయి కట్టాలిగా. ఉన్న డబ్బంతా ఒక అణా అయితే రూపాయి ఎలా వస్తుంది!

అంతలో ఎదురుగా ఒక గడ్డపుమనిషి వస్తున్నాడు. అచ్చు జార్జి బెర్నార్డ్‌షా లాగే వున్నాడు. షా గాని దెయ్యమై యిండియా వచ్చాడేమో అనుకొన్నాను. కాని దగ్గరగా అతను వచ్చేసరికి, వాడొక ముష్టివాడని గుర్తించి నిమితపడ్డాను.

కాని షా జీవితం జ్ఞాపకంవచ్చి అప్రయత్నంగా ఎదురుగా వస్తున్న "ఛార్లెట్ టౌన్ షెండ్" పై పడింది. అదిరిపోయాను. ఆ పోతున్నవాడు నిజంగా 'షా' అనే అనుమానం ధృవపడింది. ఎదురుగా షా భార్యని చూస్తూ యింకా ఏం ధైర్యపడాలి? బాబో యిద్దరూ దయ్యాలైవచ్చారని అక్కణ్ణించి పక్కసందులోకి ఒకటే పరుగు!

చివరికి, ఫర్వాలేదు వాళ్లు కనిపించరనే ధైర్యం చిక్కిన తర్వాత ఆగి, రొప్పుకొంటూ అక్కడ కూలబడ్డాను.

మళ్ళీ "టౌన్ షెండ్" జ్ఞాపకమొచ్చింది. కాని ఈసారి భయపడలేదు. కాగా ఆ త్యాగమయి కి ఒక్క నమస్కారం పెట్టాలని బుద్ధి పుట్టింది. నిజంగా ఆమె ఎంత త్యాగమయి కాకపోతే నలభైఏళ్ళ చీపురుపుల్లలాంటి 'షా'ని పెళ్ళి చేసుకొంటుంది?

వెంటనే నా జీవితం జ్ఞాపకానికొచ్చింది. నేనూ ఓ రచయితనే. చాల కథలు, వ్యాసాలు, విమర్శనలు, నవలలు, నవలికలు, నాటకాలు, గేయాలు, పద్యాలు రకరకాలవి నా పేరన ప్రకటింపబడ్డాయి. తెలుగుదేశంలో కొద్దిగా గుర్తింపబడ్డాడు. కాని నా దురదృష్టమో, లేక తెలుగు కన్యల తెలివితక్కువో మరి నాకు "టౌన్ షెండ్" లాంటి మగువే అగుపించలేదు. కనీసం ఒక ఉత్తరమయినా ఏ తెలుగు స్త్రీగూడ రాసి ఎరుగదు.

కేవలం 'షా' రచనలు చదివి అమాంతంగా ఆ "టౌన్ షెండ్" అతన్ని ప్రేమించి పెళ్ళి చేసుకొంది. మరి నా రచనలు చదివే యింత

మందిలో ఒక అమ్మాయి ఐనా జన్మలో ఒక ఉత్తరం రాసిందా!

ఒక నిట్టూర్పు విడచి నిలబడ్డాను. ఎదురుగా ఫేన్సీషాపు కనిపించింది. అది నా కెందుకు అని పోవడానికి ఒక అడుగు వేసేసరికి, అబ్బా! వళ్ళంతా జింమంటోంది చెప్పడానికి. రెండే రెండు కళ్ళు నాకేసి అచ్చంగా నన్ను వుద్దేశించే చిరునవ్వు నవ్వుతున్నాయి. వళ్ళు పులకరించింది. మెల్లగా మెట్లెక్కి లోపలికి వెళ్లాను.

నిజమే ఆసుందరాంగి నన్ను చూసే నవ్వింది. నవరత్నాల చిరునగవు. కనురెప్ప వేయకండా సరాసరి ఆమె దగ్గరకే వెళ్ళాను. పక్కని సన్నగా పియానో వాగుతోంది.

"ఏంవిటి కావాలి?"

సమాధానం చెప్పడానికి బుద్ధి పుట్టలేదు-దువ్వెన్లు, అద్దాలు, రిబ్బన్లు, స్నోలు, పౌడర్లు రకరకాలవి కనిపిస్తున్నా, చెబితే ఆ యువతి మాయమయిపోతుందని.

మళ్ళీ అడిగింది.

ఈసారి చెప్పక తప్పిందికాదు. ఆమె నాకేసి కొంటెమాపు చూస్తూ, నవ్వుతూ లోపలికి వెళ్ళింది.

ఆమె మాయమవగానే దడ పుట్టింది. లోపలినించి 'స్నో' ఎలానూ తెస్తుంది. నేను కొనవలసి వుంటుంది. అది కొనేసపాటి డబ్బుంటే లాటరీవేసి, లక్ష గడించి, ఫ్రాన్సే పోదును. ఇక అక్కడ వుంటే లాభం లేదని పరుగు తీశాను.

రోడ్డుమీద ఆలోచన పుట్టింది. చిరునగవుతో ఆ దొరసాని నన్ను ఆకర్షించినట్టే నేను ఓ చిన్న చిరునవ్వుతో ఎవరినయినా వశపరచుకో గలననే ఉపాయం కలిగింది. అలా ఒక మగువని మోహించామా యిక మనం తిన్నగా విమానంమీద ఫ్రాన్సు పోగలమనే ధైర్యం వచ్చింది.

అయితే ఎలా నవ్వాలి?...చిరునవ్వు—ఎవరిని చూసి?...ఓస్ ఈ కలకత్తాలో అలాంటి ముఖాలే తక్కువా? ఎవరినో ఒకరిని చూసి ఒక నగవు విసురు. అంతే సమాధానం మళ్ళీ చిరునవ్వు వస్తుంది. సరే అనుకొనేసరికి ఎదురుగా ఒక ఎర్రటి ముఖం, డిమ్‌గ్లాసెస్ వెనక కళ్ళు, రంగుపూసిన పెదవులు, విలాసంగా వంగే మెడ, సుళ్లు తిరుగుతున్న ఒక గలాబీ సిల్కుపైట. కుడిచేతిలో సంచి, ఎడం చేతిలో రంగుల గొడుగు. కాళ్ళకు ముఖమల్ చెప్పులు-గల ఒక 'విలాసిని' కనిపించింది.

ఈమెని చూసి నవ్వాలనుకొన్నాను. నరాలు బిగించి పెదవులని సాగించే సరికి ఆ పెదవులు కొంచెం ఏడ్చే చిన్నపిల్లవాడి ముఖభంగిమకి మారి వూరుకొంది. ఆవిలాసిని దాటిపోయింది.

మళ్ళీ పౌరుషం వచ్చింది. ఛా! తెలుగులో యింత పెద్ద రచయిత నయిన నేను, ఈ బెంగాలీ పడుచులకి తీసికట్టుగా అయిపోయానేం? ఫ్రాన్సు పోతే అమాంతంగా ఒక ఇంటి అల్లుడ నవవలసిన నేను ఈ వంగవరూధినికి లోకువయిపోయానేం?

అజంతా గుహల్లో ఆంధ్రశాలివాహనుని సౌందర్యం గుర్తుకొచ్చింది. అమరావతిలో నా అమరప్రతాపం గుర్తుకొచ్చింది! ఏవిటి? నన్ను చూస్తే "ఓ కవిసామ్రాట్"అని అంజలులర్పించి పూలబాటని పరచవలసిన స్త్రీలు నేను నవ్వినా, నన్ను గమనించనట్టే పోతూ నన్నెంత అవమానపరచాడు! చాల కోపం వచ్చింది. కాని మాటాడలేదు.

తిన్నగా వచ్చేసరికి ఎదురుగా ముగ్గురు యువతులు వొయ్యారపు కులుకులతో కాలేజీనించి వస్తున్నారు. వీళ్ళని చూడగానే మళ్ళా 'చిరునవ్వు' ప్రయోగించాలని బుద్ధి పుట్టింది.

సరిగ్గా వీళ్ళు నా ఎదురుగా వచ్చేసరికి, అడ్డంపడి ఒక్క ముఖంలోకే చూడసాగాను చిరునవ్వుతో. వాళ్లు ముగ్గురూ నాకేసి వింతగా చూసి, ఒక్కసారే విరగబడి నవ్వారు.

"మేడ్‌ఫెలో..." అంటూ చరచర వెళ్ళిపోయారు.

నాకు మహాకోపం, ఆగ్రహం కలిసి వచ్చాయి. ఆడదానికి ఎంత లోకువైపోయాను. నా ఆంధ్రదేశంలో విద్యార్థులయితే నాకు "పిచ్చివాడు" అనే బిరుదాన్ని యిచ్చి నవ్వేవారా! ఇంతకీ ప్రవాసంలో వుండబట్టి కదా!

ఇక యిక్కడ వుండగూడదు. మళ్ళానడక సాగించాను.

అంతలో ఎదూరుగా డ్యూక్ ఆఫ్ విల్లింగ్

టన్ కనిపించాడు. నన్ను ఆపి "ఎక్కడికి పోతున్నావోయ్ నందీ?" అని అడిగాడు.

"నాకు ఆడవాళ్లమీద కోపం వచ్చింది. పోతున్నాను."

"ఎందుకు?"

"వాళ్ళు నన్ను ప్రేమించమంటే—నాకు తాటాకులు కడుతున్నారు."

"మరి కట్టరూ?" అంటూ విరగబడినవ్వాడు. "సహచరిని అలాగా ఎన్నుకొంటావ్?"

మరెలా సంపాయించాలి?" ఆత్రుతతో ప్రశ్నించాను.

"నేను విల్లింగ్‌టన్ అని నీకు తెలుసు కదూ?"

"ఆఁ, అవును."

"నాకు గూడా ఒక సహచరి వుండేది తెలుసా?"

"ఏమో. నాకు జ్ఞాపకం లేదు. సరేగాని ఎవరామె?"

"లేడీ సేలిస్‌బరీ. ఆమెను నేను ప్రేమించాను."

"అవునవును. రోజుకో వుత్తరం చొప్పున రాసేవారట."

"అవును. అంతేకాదు; కొన్ని రాజకీయ రహస్యాలని గూడా ఆమెకి చెప్పేవాడిని. ఆమే నా ప్రాణంగా వుండేది. కాని..."

"కాని, పెళ్ళి చేసుకోలేకపోయారా?"

"ఛా! పెళ్ళేమిటోయ్. ఆమె నాకూతురు లాంటిది. ఆమె నా అంతరంగంలోకి ప్రవేశించినపుడు ఆమె వయసు ఇరవైఆరు. అదీగాక అప్పటికే ఆమె ఒక తల్లి. నా వయస్సు ఎనభై ఒకటి."

"ఆ!"

"అవునోయ్. మనిషికి హృదయం ప్రధానం గాని వయస్సు కాదు."

"అయితే..." అంటూ చుట్టూ చూసేసరికి ఆయన మాయమయిపోయాడు.

కాళ్ళీడ్చుకొంటూ కొంత దూరం వచ్చాను. పక్కన ఒక నక్క కూసింది. ఆగాను. ఎవరో దగ్గరగా వస్తున్నట్టు గమనించి "ఎవరూ" అని అరచాను.

"మీరెవరు?" అనే ప్రశ్న వినవచ్చింది.

"ఒక కవిని, జాన్ గ్లాడిస్ నంది" అన్నాను.

"ఓహో, కవి సామ్రాట్టులా ... నేను ఇంగ్లండ్‌లో ఒక గొప్ప రాజకీయవేత్తను."

"ఇక్కడికెలా వచ్చారు."

"చచ్చిపోయాను."

"ఎలా?"

"వినాలని వుందా? ఐతే యిలారాండి" అంటూ ఆయన కూచొన్నారు. "నా పేరు లార్డు మెల్‌బోర్న్. నేను సాధారణంగా స్త్రీ సహాయంలేనిదే ఏమీ చేయలేను. నా పెళ్ళి ఒక విషాదమయిన కథ లెండి. అందువల్ల నేను సహచరికోసం వేట మొదలు పెట్టాను. చాలామంది స్త్రీలని, పెండ్లి అయినవాళ్ళనూ కానివాళ్ళనూ స్నేహం చేసుకొన్నాను. నాకు ఆకృతికంటె అంతరంగంమీద గౌరవం మెండు. కాని అలాంటిస్త్రీ నాకు ఎక్కడా దొరకలేదు."

"మిసెస్ కారొలిన్ నార్టన్‌ని ప్రేమించారట?..."

"అవునే. ఆమె గొప్ప నవలా రచయిత్రి; క్రమశిక్షణగల యువతి. ఆమెని నేను ప్రేమించాను. అప్పటికే ఆమె వివాహిత స్త్రీ. మొదట్లో ఆమె భర్త నన్ను అనుమానించలేదు. కాని తదుపరి నా మీద కేసు పెట్టాడు. అది నా గౌరవానికి, నేను ఆక్రమించిన ఉన్నతాసనానికి మచ్చని రాజీనామా ఇచ్చాను. కాని చక్రవర్తి ఒప్పుకోలేదు. చివరికి ఆయన నిందలన్నీ నిరాధారాలయాయి. కాని నా పేరు ప్రతిష్టలు, గౌరవ మర్యాదలుఅన్నీ చితికిపోయాయి. అంతే!"

నేను తలెత్తి చూసేసరికి ఎదురుగా ఏః లేదు.

కాసేపటిలో నేను గు

శ్మశానమని!